



నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

- రవాణా అనుమతులు చూపమన్న విపక్ష నాయకులు
- అధికారుల వద్ద ఉన్నాయన్న నిర్వాహకులు
- కె.రామభద్రపురం రీచ్ వద్ద నిరసన
- ఇసుక వాహనాలను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగింత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఇసుక లొల్లి

కొమరాడ, మార్చి 11: కొమరాడ మండలం కూనేరు రామభద్రపురం గ్రామ సమీపంలోని నాగావళి నది వద్ద జరుగుతున్న ఇసుక దందాపై టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నిరసన వ్యక్తంచేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహనాలను పట్టుకొని అధికారులకు అప్పగించారు. కె.రామభద్రాపురం రీచ్‌లో అనుమతులు లేకపోయినా గతం వారం రోజులుగా భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వే బిల్లులు ఇచ్చి మరీ వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తూ కోట్లాది రూపాయలు దోచుకుంటున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 8న 'ఇసుకా దందా' అనే కథనం వచ్చింది. దీనిపై అధికారులతో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు స్పందించారు. ఈ మేరకు సోమవారం ఉదయం ఈ ప్రాంతాన్ని సందర్శించారు. ఇసుక తరలింపునకు ఉన్న అనుమతులు చూపించాలని టీడీపీ మండల కన్వీనర్ ఎస్.ఉదయశేఖరపాత్రుడు ఇసుక రేవును నిర్వహిస్తున్న ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులను కోరారు. అనుమతి పత్రాలు చూడాలన్నా, తెలుసుకోవాలన్నా అధికారుల వద్దకు వెళ్లాలని వారు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో అంతర్ రాష్ట్ర రహదారిపై రాస్తారోకోకు విపక్ష పార్టీలు సిద్ధమయ్యాయి. ఇంతలో కొమరాడ ఎస్ఐ నీలకంఠం వచ్చి మాట్లాడారు. అనంతరం తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్ కూడా ఇసుక రేవు వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇసుక రీచ్‌లపై ఉన్నతాధికారులతో సోమవారం సాయంత్రం సమావేశం ఉందని, అంతవరకు ఇసుక తరలింపు నిలిపివేయాలని నిర్వాహకులను తహసీల్దార్, ఎస్ఐలు సూచించారు. దీనికి నిర్వాహకులు అంగీకరించడంతో నాయకులు నిరసన కార్యక్రమాన్ని విరమించుకున్నారు. అయితే మధ్యాహ్నం యథావిధిగా ఇసుకను తరలించడం ప్రారంభించారు. విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు అక్కడకు చేరుకుని ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను అడ్డుకొని తహసీల్దార్‌కు అప్పగించారు. అలాగే, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని ఆయనకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. రీచ్ అనుమతులను పరిశీలించే వరకు ఇసుకతో వచ్చిన వాహనాలను ఎస్ఐకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్, జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ సుదర్శనరావు, నాయకులు ఎన్.మధుసూదనరావు, కృష్ణంనాయుడు, జనసేన, బీజేపీ పార్టీల మండల కన్వీనర్లు శ్రీకర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్‌కు అప్పగిస్తున్న దృశ్యం



ఇసుకను లారీలకు లోడ్ చేసే యంత్రం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు



ఫ్లైఓవర్‌పై ఇరువైపులా స్తంభించిన ట్రాఫిక్

ఫ్లైఓవర్‌పై ఆగిన ఆర్టీసీ బస్సు

- భారీగా స్తంభించిన ట్రాఫిక్
- పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ఇంటర్ విద్యార్థుల పాట్లు

పార్వతీపురం టౌన్, మార్చి 11: జిల్లా కేంద్రంలోని ఫ్లైఓవర్‌పై ఓ ఆర్టీసీ బస్సు సాంకేతిక సమస్యతో నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించడంతో వాహనచోదకులు, పాదచారులతో పాటు ఇంటర్ పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. సోమవారం ఉదయం 8 గంటల సమయంలో పార్వతీపురం నుంచి పాలకొండకు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు సరిగ్గా ఫ్లైఓవర్‌పైకి వచ్చేసరికి సాంకేతిక సమస్య తలెత్తి రహదారి మధ్యలో ఆగిపోయింది. దీంతో అటు, ఇటుగా వెళ్లేందుకు భారీ, ద్విచక్ర వాహనాలకు, పాదచారులకు అవకాశం లేకుండా పోయింది. ఫలితంగా ఫ్లైఓవర్‌కు ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీనివల్ల వాహనచోదకులు, పాదచారులతో పాటు వివిధ గ్రామాల నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు రాసేందుకు వెళ్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేసేదేమీ లేక విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఉరుకులు, పరుగులు పెట్టారు. ఇంతలో ట్రాఫిక్ పోలీసులు రంగప్రవేశం చేసి ఆగిపోయిన బస్సును పాదచారులతో కలిసి ముందుకు నెట్టారు. అనంతరం ట్రాఫిక్ క్లియరెన్స్ చేయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

నన్ను గెలిపించే బాధ్యత మీదే

- 'ఉపాధి' క్షేత్ర సహాయకులతో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి రహస్య సమావేశం

జియ్యమ్మవలస, మార్చి 11: 'రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పూర్తిగా సహకరించి నన్ను గెలిపించే బాధ్యత మీరే తీసుకోవాలి. నేను గెలిచిన తరువాత కచ్చితంగా మిమ్మల్ని గుర్తించి మీ కష్టాలు తీరుస్తా' అని కురుపాం నియోజకవర్గ శాసన సభ్యురాలు పాముల పుష్పశ్రీవాణి ఉపాధి హామీ క్షేత్ర సహాయకులతో అన్నట్లు తెలిసింది. ఆదివారం జియ్యమ్మవలస మండల క్షేత్ర సహాయకులతో తన స్వగృహంలో రహస్య సమావేశం ఏర్పాటు చేసిన ఆమె సోమవారం కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల క్షేత్ర సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ విషయం బయటకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకున్నారు. ముందుగా క్షేత్ర సహాయకుల సెల్ ఫోన్లన్నీ తీసుకున్నారు. మీడియాను సైతం అనుమతించలేదు. 'వచ్చే ఎన్నికల్లో పూర్తి సహాయ సహకారాలు అందించాలి. నా గెలుపు మీ భుజస్కంధాలపై వేస్తున్నా. కచ్చితంగా గెలిపించాలి' అని ఆమె కోరినట్లు సమాచారం.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

- ప్రభుత్వం వద్ద డబ్బులు లేవా?
- పార్వతీపురంలో బైక్ ర్యాలీ



బైకు ర్యాలీ చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

పార్వతీపురంటౌన్/బెలగాం, మార్చి 11: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఏఎంసీ ప్రాంగణం నుంచి బెలగాం కలెక్టరేట్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రూ.10వేలు, రూ.20వేలు లోపు డిపాజిట్‌దారులందరికీ న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. గద్దెనెక్కిన తర్వాత ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. ఇప్పటి వరకు రూ.906 కోట్లు మాత్రమే రూ.20వేలు లోపు చెల్లించిన బాధితులకు మాత్రమే జమ చేశారని, ఇంకా రూ.3,080 కోట్లు మరో 20 లక్షల మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ ఏడాది చివరి బడ్జెట్‌లో కూడా బాధితులకు అన్యాయం జరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే మృతి చెందిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున ఇస్తామని, చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. 242 సార్లు అనేక సంక్షేమ పథకాలకు డబ్బులు ఇవ్వడానికి బటన్ నొక్కారని, బాధితులకు ఇవ్వడానికి డబ్బులు లేవా.. అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, కోశాధికారి ఎస్.అనంతరావు, ఆర్వీఎస్ కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం బిల్లు బకాయిలు చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద ఏపీ రైతు సంఘం నిరసన
- జేసీకి వినతిపత్రం అందజేత

బెలగాం, మార్చి 11: ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు వెంటనే బకాయిలను చెల్లించాలని ఏపీ రైతు సంఘం నాయకుడు బి.అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, జేసీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు చేసిన 21 రోజుల్లోనే డబ్బులు జమ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఊకదంపుడు ప్రచారం చేసిందే తప్ప ఆచరణలో కనబడడం లేదన్నారు. జనవరి 21 నుంచి నేటి వరకు రైతులకు రావల్సిన ధాన్యం బకాయిలు రూ.70కోట్లు ఉందని తెలిపారు. నెలలు గడుస్తున్నా బకాయిలు చెల్లించకపోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తక్షణమే బకాయిలు చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

నిధులు పక్కదారి

- మండల పరిషత్ కార్యాలయంలో అవకతవకలు
- రికార్డుల నిర్వహణలో లోపం
- అభివృద్ధికి నోచుకోని కార్యాలయ భవనం
- ఎటు చూసినా చెదలే దర్శనం



మండల పరిషత్ కార్యాలయం కిటికీలు ఊడిన దృశ్యం

గరుగుబిల్లి, మార్చి 11: మండల పరిషత్ కార్యాలయంలో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. కార్యాలయ పరిపాలన ఖర్చులకు మంజూరవుతున్న మండల పరిషత్ సాధారణ నిధులు పక్కదారి పడుతున్నాయి. రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. చేసిన పనులకు సంబంధించిన రసీదులు కనిపించడం లేదు. ఫలితంగా మండల పరిషత్ కార్యాలయ భవనం అభివృద్ధికి నోచుకోవడం లేదు. కార్యాలయంలో ఎటువైపు చూసినా చెదలే దర్శనమిస్తున్నాయి. మండల పరిషత్‌కు సంబంధించి పలు కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన నిధులు మంజూరవుతున్నా పనులు మాత్రం జరగడం లేదు. ఈ నిధులను మళ్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. పనుల నిర్వహణకు అవసరమైన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమవుతున్నాయి. ఇదిలాఉండగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం హాలు అధ్వానంగా ఉంది. తలుపులు, కిటికీలకు చెదలు పట్టాయి. ఏ మూల చూసినా చెదలే దర్శనమిస్తోన్నాయి. సాధారణ నిధులు అత్యవసర వినియోగం, స్టేషనరీ, కార్యాలయం క్లీనింగ్, మరమ్మతుల పేరిట పక్కదారి పడుతున్నాయి. గతంలో విధులు నిర్వహించిన ఎంపీడీవో పలు అక్రమాలకు పాల్పడినా ఎటువంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు సంబంధించి రికార్డుల నిర్వహణలో లోపం నెలకొంది. నిధులు ఖర్చు అయ్యాయి తప్ప వీటికి సంబంధించిన రశీదులు మాత్రం కనిపించడం లేదు. ఈ నెల 2న జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్ 2022-23 ఆర్థిక సంవత్సరం ఖర్చులు వార్షిక తనిఖీకి వచ్చిన సమయంలో రికార్డులు అస్తవ్యస్తంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై పలువురు సిబ్బందికి ఈ నెల 6న షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే కార్యాలయంలో నెలకొన్న పరిస్థితులను సీఈవో దృష్టికి తీసుకువెళ్లినా స్పందన కరువైంది.



సమావేశ మందిరంలోని తలుపు దృశ్యం



కిటికీలకు చెదలు పట్టిన దృశ్యం

సమస్యలు తెలియజేశాం

మండల పరిషత్ కార్యాలయంలో నెలకొన్న సమస్యలను జిల్లా పరిషత్ సీఈవోకు వివరించాం. కార్యాలయానికి ఆనుకుని ఉన్న కిటికీలు, తలుపులు, తదితర వాటికి మరమ్మతుల కోసం మండల పరిషత్ సాధారణ నిధులు కేటాయించిన దానిపై ఆరా తీస్తాం. పనులు నిర్వహించకుంటే గత ఎంపీడీవో నుంచి రికవరీ చేయిస్తాం. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించాల్సి ఉంది. అవకతవకలు జరిగినట్లయితే తగు చర్యలు నిమిత్తం జిల్లా పరిషత్ సీఈవో దృష్టికి తీసుకువెళ్తాను.

-పి.సూర్యనారాయణ, ఎంపీడీవో, గరుగుబిల్లి

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం: జేసీ

పార్వతీపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం పనిచేస్తోందని జాయింట్ కలెక్టర్ శోభిక తెలిపారు. ఎన్నికల నిర్వహణపై మీడియా ప్రతినిధులకు అవగాహన సదస్సును కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఎన్నికల సమయంలో పాటించాల్సిన విధి విధానాలు వివరించారు. మీడియా ప్రతినిధుల పాత్ర ఎన్నికల సమయంలో కీలకమన్నారు. వార్తలు రాసేటప్పుడు వాటి నిజానిజాలు తెలుసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించడంలో మంచి వార్తలు సహాయకారిగా ఉపయోగపడుతుందన్నారు. మీడియా తన నైతికతను పాటించాలన్నారు. పెయిడ్ న్యూస్ జోలికి వెళ్లవద్దన్నారు. పెయిడ్ న్యూస్‌ను మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు. పెయిడ్ న్యూస్ రాయడంతో పోటీలో ఉన్న అభ్యర్థి వ్యయఖాతాలో ఆ విలువను జమ చేయడం జరుగుతుందన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా ప్రకటనలకు విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలన్నారు. ప్రకటనలకు అనుమతులు పొందేందుకు గుర్తింపు పొందిన పార్టీలు కనీసం మూడు రోజుల ముందు, గుర్తింపు లేని పార్టీలు కనీసం వారం రోజుల ముందు అనుమతి కోసం ఎంసీఎంసీకి దరఖాస్తు చేయాలన్నారు. ఈ అవగాహన సదస్సులో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, డిప్యూటీ కలెక్టర్ ఆర్.వి.సూర్యనారాయణ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి లోచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శోభిక

బంగారు భవితకు ఓటే వజ్రాయుధం

● కొత్త ఓటర్లతో బేబీనాయన ముఖాముఖి

● యువత ప్రశ్నలకు సావధానంగా సమాధానమిచ్చిన నేత



కార్యక్రమంలో మాట్లాడుతున్న బేబీనాయన

బొబ్బిలి, మార్చి 11: తెలుగు యంగ్ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక లోకబంధు రెసిడెన్సీలో కొత్తఓటర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్ వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన) మాట్లాడుతూ రాష్ట్ర బంగారు భవిష్యత్ కోసం ప్రతి ఒక్కరూ వజ్రాయుధం, బ్రహ్మాస్త్రంలాంటి ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. తప్పుడు పద్ధతుల్లో పాలన సాగించే నాయకులకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలన్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ధరలు ఆకాశాన్ని తాకాయని, యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోయారన్నారు. యువత జాగ్రతం అయితే అవినీతి రహిత సమాజం రావడంఖాయమని, రాష్ట్రానికి మేలు జరగాలన్న దృక్పథంతో ఓటును వినియోగించుకోవాలని బేబీనాయన హితవు పలికారు. ● నేటి సమాజంలో ఎంతో మంది సొంతగడ్డను, జన్మభూమిని వీడి ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడుతున్నారని, బొబ్బిలి రాజవంశీయుడైన బేబీనాయన సొంతగడ్డకు సేవలందించాలన్న సదుద్దేశంతో చెన్నై నుంచి వచ్చి నిస్వార్థంగా ప్రజా సేవ చేస్తున్నారని రాష్ట్ర ప్రొఫెషనల్స్ సంఘం అధ్యక్షురాలు పొడపాటి తేజస్వి అన్నారు. గ్రామ గ్రామాన బేబీనాయన అందించిన సేవలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయని, సొంత సొమ్ముతో అన్న క్యాంటీన్ కూడా నిర్వహిస్తున్నారని కొనియాడారు. ● ఈ సందర్భంగా యువఓటర్లతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో బేబీనాయన వారందరికీ సమర్థంగా సమాధానాలు చెప్పి ఆకట్టుకున్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిపై ఉక్కుపాదం మోపుతాం.. ఆరోగ్యానికి హేతువుగా మారిన మద్యాన్ని పారదోలి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తాం.. బొబ్బిలి పట్టణంలో అత్యాధునిక వసతులతో లైబ్రరీకి హంగులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాడైన రోడ్లకు టీడీపీ-జనసేన ప్రభుత్వ హయాంలో మహర్దశ వస్తుందని.. ఇలా యూత్ అడిగిన ప్రతి అంశానికి బేబీనాయన సమగ్రంగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి ఎసతీష్‌కుమార్ తదితరులు ప్రసంగించారు. పెద్దసంఖ్యలో కొత్త ఓటర్లు, టీడీపీ నాయకులు, మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మార్పు రావాలంటే సైకో పోవాలి

● కోండ్రు మురళీ మోహన్



పార్టీలో చేరిన వారితో కోండ్రు

రాజాం: రాష్ట్రంలో మార్పు కావాలంటే సైకో పాలన పోవాలని కోండ్రు మురళీమోహన్ పిలుపునిచ్చారు. శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వంగర మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన వైసీపీకి చెందిన పాండ్రంకి భుజంగరావు, నవిరి శంకరరావు, నవిరి రాము, పాండ్రింకి నర్సింహమూర్తి, గవిడి అప్పలనాయుడు, ఉప్పు రాములు, నల్లబారిక బాలకృష్ణ, తదితర 34 వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు వంచనకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లచ్చుభుక్త కృష్ణమూర్తి, తుమ్మి రాజగోపాలనాయుడు, మజ్జి వెంకటనాయుడు పాల్గొన్నారు. ● ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పాలని కోండ్రు మురళీమోహన్ పిలుపుని చ్చారు. సోమవారం పురపాలక సంఘం పరిధిలోని మల్లికార్జున కాలనీ, మెహర్ బాబా కాలనీలో ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, ఎక్కడ ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయో సర్వేచేయించి ఆక్రమ ణలకు పాల్పడ్డారని బవిమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, శాసపు రమేష్‌కుమార్, పొట్టా చిట్టిబాబు, బనిశెట్టి వెంకటరావు, వంజరాపు రాము, ఆశపు సత్యనారాయణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, టంకాల కన్నంనాయుడు, ఆటో కోటి, కె.రవి, ఉరిటి సురేంద్ర పాల్గొన్నారు. ● రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని మాజీ మంత్రి, రాజాం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ సూచించారు. సోమవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో మారెడుబాక, నందబలగ గ్రామాల పార్టీ నాయకులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జిలు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న భూ ఆక్రమణలు, ఇసుక దందాలు, అవినీతి, అక్రమాలు ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో దుప్పలపూడి శ్రీనివాసరావు, నంది సూర్యప్రకాష్‌రావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, శాసపు రాజేష్‌కుమార్, వంగా వెంకటరావు, జరజాన నీలయ్య, మరిపి జగన్మోహన్‌రావు, టంకాల నాగరాజు పాల్గొన్నారు.

ఉంగరాడలో కోండ్రు ప్రచారం

రేగిడి: మండలంలోని ఉంగరాడలో సోమవారం రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిక్స్‌గ్యారెంటీ పథకాలు, జగన్ అరాచకపాలనపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌బాబు, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, గురవాన ధనంజయ్, కర్డేన మహేష్, ఉంగరాడ సర్పంచ్ చల్ల భుజంగరావు పాల్గొన్నారు.

సకాలంలో నేత్ర పరీక్షలు చేసుకోండి

తెర్లాం: వయసు పైబడిన ప్రతి ఒక్కరూ రెండు సంవత్సరాలకు ఒకసారి నేత్ర పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి నుంచి దృష్టిని కాపాడుకోవచ్చునని పెరుమాళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి మనోజ్ఞ అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెరుమాళి ఆవరణలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రజలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు మాట్లాడుతూ గ్లకోమా అనేది కుటుంబ చరిత్ర కలవారికి, చక్కెర వ్యాధి కలవారికి, గాయాలు బారినపడిన వారికి, వచ్చే అవకాశం ఉందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. 55మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి వారిలో 22 మందికి కంటి శస్త్ర చికిత్సల కోసం పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, సామాజిక ఆరోగ్య అధికారి పుష్పలత, పర్యవేక్షకులు భవానీ, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు చేయించాలి

రామభద్రపురం: గర్భిణులు పాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి పులి దిలీప్‌కుమార్ సూచించారు. సోమవారం గర్భిణులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు చేయిస్తే తల్లీపిల్లలకు ఇబ్బంది ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి ఏఎల్‌జీ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

16న జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈ నెల 16న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయాధికారి బి.సాయికల్యాణ్‌చక్రవర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో బ్యాంకులకు సంబంధించిన కేసులు, కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, సెక్షన్ 138, ఎన్ఐ యాక్ట్, ఎక్సైజ్ కేసులు, మోటారు ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, కార్మిక సంబంధిత కేసులు, విద్యుత్, నీటి పన్నుల కేసులు, భూ సేకరణ సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ఫూల్‌బాగ్ కాలనీ, హనుమాన్ నగర్‌లో ఎంఆర్ పీజీ కళాశాల హాస్టల్ భవన ప్రాంగణంలో ఆరోజు ఉదయం 10 గంటలకు లోక్‌అదాలత్ ప్రారంభమవుతుందని న్యాయాధికారి తెలిపారు.

హోం ఓటింగ్‌పై అవగాహన

లక్కవరపుకోట(కొత్తవలస): భారత ఎన్నికల కమిషన్ నూతనంగా చేపట్టబోతున్న హోం ఓటింగ్ కార్యక్రమంపై సోమవారం కొత్తవలసలో అవగాహన కల్పించారు. అంగవైకల్యం 40 శాతం దాటి ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు తమ ఇంటి వద్ద నుంచి ఓటు వేసుకునే అవకాశాన్ని భారత ఎన్నికల కమిషన్ కల్పించిందని చైతన్య మానసిక వికలాంగుల పాఠశాల చైర్మన్ బోజంకి సన్యాసిరావు తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి 5 రోజుల్లో ఫారం -12డీని పూర్తి చేసి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేయాలన్నారు. ఒక టీం వచ్చి బ్యాలెట్‌ను తీసుకుంటారని తెలిపారు. బ్యాలెట్‌ను ఏ విధంగా ఉపయోగించాలో చెప్పడానికి ఎన్నికల సిబ్బంది వస్తారన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

కలెక్టరేట్: జిల్లాలోని 26 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో ఆరో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమకుమార్, అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీల్లో 7 నుంచి 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయులు లక్ష్యాలు చేరుకోవాలి

రేగిడి: ఉపాధ్యాయులు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు చేరుకోవాలని ఎంఈవో-1, 2లు వరప్రసాదరావు, బి.ఏరకయ్యలు పేర్కొన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయంలో సోమవారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, హైస్కూల్ హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోండి

రామభద్రపురం: ఈ వేసవిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన క్రాష్ ప్రోగ్రాంకు సంబంధించి మెటీరియల్ ఆటోలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో వెంటనే బోర్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీ బెవర ప్రసాద్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

ఆశీలు వేలంపాట మళ్లీ వాయిదా

రాజాం: పురపాలక సంఘం పరిధిలోని ఆశీలు వేలం పాట ఏడోసారి కూడా వాయిదా పడింది. సోమవారం కమిషనర్ నారప్పలనాయుడు ఆధ్వర్యంలో పురపాలక సంఘం కార్యాలయంలో వేలంపాట నిర్వ హించారు. కాంట్రాక్టర్లు పాట పాడటానికి ముందుకు రాకపోవడంతో వాయిదావేశారు. గత ఏడాది రూ.38 లక్ష లకు పాట పాడిన విషయం విదితమే. అంతమొత్తం నిధులు వసూలు కాకపోవడంతో ఈ ఏడాది పాటను పాడేందుకు ఏ ఒక్క కాంట్రాక్టరూ ముందుకు రాలేదు. అయితే పాటలో పాల్గొనేందుకు పదిమంది వరకు కాంట్రాక్టర్లు టెండర్లు వేసినా, అధికారులు నిర్ణయించి పాటకంటే తక్కువగా వస్తే పాటకు ముందుకొస్తామన్నారు.

కొత్త ఓటర్లంతా టీడీపీకి ఓటేయండి



విద్యార్థులతో మాట్లాడుతున్న తెలుగుయువత, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

విజయనగరం రూరల్: 'కొత్త ఓటర్లారా.. టీడీపీకి ఓటేయండంటూ' తెలుగు యువత, తెలుగునాడు స్టూడెంట్స్ ఫెడరేషన్ (టీఎన్ఎస్ఎఫ్)లు పిలుపునిచ్చాయి. 'ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్' కార్యక్రమంలో భాగంగా ఆయా విభాగాల నాయకులు నగరంలోని ట్యూషన్ సెంటర్లు, కోచింగ్ సెంటర్లు, ప్రైవేటు కళాశాల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి పొగిరి పైడిరాజు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెవర భరత్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. నిరుద్యోగులకు ఏటా జాబ్ క్యాలెండర్ అన్న హామీని జగన్ విస్మరించారన్నారు. దీంతో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేవన్నారు. విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజును గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత-టీఎన్ఎస్ఎఫ్ నాయకులు మాతా బుజ్జి, మజ్జి పైడిరాజు, బండారు రాజేష్, పీకేఎల్ రాజు, పొట్నూరు గోవింద్, పెనుమత్స మణికంఠ రాజు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల ఘనత టీడీపీదే



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం

విజయనగరం రూరల్: మహిళా సాధికారితే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసిందని ఆ పార్టీ మహిళా విభాగం నేతలు పత్తిగిల్లి సూర్యకుమారి, అనురాధ బేగంలు చెప్పారు. సోమవారం నగరంలోని 3, 4 డివిజన్ల పరిధిలో ఉన్న డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల ఏర్పాటుతో పాటు, మహిళలకు వ్యాపార అవకాశాలు కల్పించారని తెలిపారు. తద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతమయ్యేందుకు టీడీపీ కృషి చేసిందన్నారు. 'కలలకు రెక్కలు' పథకంతో ఎంతో ప్రయోజనం కలగనుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి గజపతిరాజుని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా విభాగం నాయకులు రౌతు పద్మ, మురిపేన పద్మలత, వీరలక్ష్మి, ఝాన్సీ, టీడీపీ నాయకుడు గండ్రేటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

గజపతినగరం: టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తన గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కొండపల్లి శ్రీనివాస్ కోరారు. సోమవారం గజపతినగరంలోని జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ స్వగృహంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపే లక్ష్యంగా ప్రతిజ్ఞరూ పనిచేయాలన్నారు. పడాల అరుణ మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూచనల మేరకు తమ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పడాల శరత్, మండల అధ్యక్షుడు మునకాల జగన్, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను హింసిస్తే కఠిన చర్యలు

● అదనపు ఎస్పీ అస్మాపరహీన్ ● ఎస్పీ 'స్పందన'కు 22 ఫిర్యాదులు



ఫిర్యాదుదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఏఎస్పీ అస్మాపరహీన్

విజయనగరం క్రైం: తల్లిదండ్రులను హింసించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ అస్మాపరహీన్ ఆదేశించారు. సోమవారం 'స్పందన' కార్యక్రమంలో 22 ఫిర్యాదులు స్వీకరించారు. ● విజయనగరం మండలం చెల్లూరుకు చెందిన మహిళ అదనపు ఎస్పీ అస్మాపరహీన్‌కు ఫిర్యాదు చేస్తూ తన భర్త మరణానంతరం తన కుమారులు ఆస్తులు పంచుకొని తన బాగోగులు సక్రమంగా చూడడం లేదని.. న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆమె విచారణ చేపట్టి ఫిర్యాదీకి న్యాయం చేయాలని విజయనగరం రూరల్ సీఐని ఆదేశించారు. ● జ్యూట్‌మిల్లుకు చెందిన స్థలంలో కొంత మంది వ్యక్తులు అక్రమంగా శ్మశానం నిర్మిస్తున్నారని.. వారిపై చర్యలు తీసుకోవాలని నెల్లిమర్ల జ్యూట్ ప్రతినిధి కోరారు. ● తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటుండగా.. తమ గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు వచ్చి తనను కొట్టారని, న్యాయం చేయాలని గుర్ల మండలం వల్లాపురానికి చెందిన వ్యక్తి కోరారు. ఈ మేరకు ఫిర్యాదులు స్వీకరించిన అదనపు ఎస్పీ స్పందిస్తూ విచారణ చేపట్టి తీసుకున్న చర్యలను తక్షణమే నివేదించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వీరకుమార్, సీఐ మురళి, ఎస్ఐలు ప్రభావతి, గణేష్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇచ్చేదెపుడు?

● కొండకెంగువ గ్రామస్థుల ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కొండకెంగువ గ్రామస్థులు

రామభద్రపురం: కొండకెంగువ గ్రామానికి చెందిన అర్హులైన వారికి ఇళ్ల పట్టాలు ఇవ్వడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని తహసీల్దార్ ఆకుల సులోచనారాణిని స్థానికులు నిలదీశారు. 2021లోనే అర్హులకు ఇళ్ల పట్టాలకు మంజూరుకు ఏర్పాట్లు చేశారని...కానీ లబ్ధిదారులకు ఇవ్వడానికి మాత్రం ఏ తహసీల్దార్ కూడా ముందుకు రాకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక టీడీపీ నాయకుడు మధు తెలిపారు. ఇక్కడి సర్పంచ్ తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కావడంతో అధికార వైసీపీ నాయకులు అడ్డు తగులుతున్నారని గ్రామస్థులు ఆరోపించారు. దీనిపై మండల వైసీపీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మణనాయుడు స్పందిస్తూ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి 2 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మంగళవారంలోగా ఇళ్ల పట్టాలు ఇవ్వకపోతే తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు.

16తో ముగియనున్న షుగర్స్ క్రషింగ్

● సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగార అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి



మాట్లాడుతున్న యాజమాన్య ప్రతినిధులు

రేగిడి: సంకిలి ఈఐడీ ప్యారీ చెక్కర కర్మాగారం ఈ ఏడాది క్రషింగ్‌సీజన్ ఈనెల 16తో ముగిస్తున్నట్లు కర్మాగార అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వి. పట్టాభిరామిరెడ్డి పేర్కొన్నారు. రైతులు ఈ విషయం గమనించి సకాలంలో ఉండిపోయిన చెరకును కర్మాగారానికి తరలించాలని కోరారు. సంకిలి ఈఐడీ ప్యారీ కర్మాగారంలో సోమవారం కర్మాగార యాజమాన్యప్రతినిధులు ఏబీపీతో పాటు డీజీఎం కేన్ రాజేంద్రన్, హెచ్ఆర్ మేనేజర్ వి.మురళీకృష్ణ, ఫైనాన్స్ మేనేజర్ శ్యామ్‌కుమార్ విలేకరులతో మాట్లాడారు. ఈఏడాది చెరకు గానుగ లక్ష్యం 3.87 లక్షల మెట్రిక్‌టన్నుల లక్ష్యం కాగా ఇప్పటి వరకు 3.72 లక్షల మెట్రిక్‌టన్నుల గానుగు పూర్తిచేసినట్లు తెలిపారు. మరో 16వేల మెట్రిక్‌టన్నులు గానుగ ఆటకు ఉండగా, ఈనెల 16లోపు పూర్తి చేస్తామని చెప్పారు. వచ్చే ఏడాది 18 వేల ఎకరాల్లో చెరకు సాగుకు లక్ష్యంగా నిర్ణయించామని, ఇందుకు రైతులకు పలురాయితీలు ఇస్తున్నామని తెలిపారు. ఈఏడాది సరాసరి రికవరీశాతం 9.24కాగా, గత ఏడాదికంటే ఈఏడాది ముందు క్రషింగ్‌సీజన్ ప్రారంభంచడం కొంత రికవరీ తగ్గినట్లు తెలిపారు. కర్మాగారాన్ని కాలుష్యరహితంగా నడిపేం దుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రజల శేయస్సు దృష్ట్యా సుగర్స్ అనుబంధ పరిశ్రమలు అన్ని జీరోబెస్డ్ పొల్యూషన్‌తో నడిపేందుకు చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు.

మహిళలకు ఓర్పు, సహనం ఎక్కువ



ఎస్.కోట ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ ప్రతిజ్ఞ

శృంగవరపుకోట, మార్చి 11: మహిళలకు ఒర్పు, సహనం ఎక్కువని వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు అన్నారు. సోమవారం శృంగవరపుకోట మండల పరిషత్ కార్యాలయంలో స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లోనూ రాణిస్తున్నారన్నారు. పోషకాహార అవస్యతకతను వివరించారు. సీడీపీవో ఉమ, ఈవోపీఆర్డీ ఐ.వి. లక్ష్మి, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి తదితరులు మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు.

మురళీకృష్ణ మృతికి సీఎం బాధ్యత వహించాలి

● ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



మునిసిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజాం రూరల్: బాపట్ల జిల్లా మేదరమెట్లలో వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో తొక్కిసలాటలో చనిపోయిన పారిశుధ్యకార్మికుడు మురళీకృష్ణ మృతికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైతికబాధ్యత వహించాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా నాయకుడు ఎ.జగన్మోహన రావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు డిమాండ్‌చేశారు. సోమవారం రాజాం మునిసి పల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతి చెందిన ప్రకాశం జిల్లా ఒంగోలుకు చెందిన మురళీకృష్ణ కుటుంబానికి రూ.కోటి నష్టపరి హారంగా ప్రకటించాలని, ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పక్కాఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆ కుటుంబాన్ని ఆదుకోకపోతే మునిసిపల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్‌కుమార్, లక్ష్మి, గురువులు, శంకర్రావు, రాజేష్, బాలరాజు, చినబాబు, రవి, రఘు పాల్గొన్నారు.

ప్రశాంత జాతర నిర్వహణకు సహకరించాలి

● పోలిపల్లి పైడితల్లి అమ్మవారి దేవస్థానం ఈవో మాధవరావు



మాట్లాడుతున్న మాధవరావు

రాజాం రూరల్: రాజాంలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహిం చనున్న పోలిపల్లి పైడితల్లి అమ్మవారి 98వ వార్షిక జాతర మహోత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేం దుకు ప్రతిఒక్కరూ సహకరించాలని దేవస్థానం ఈవో బీవీ మాధవరావు కోరారు. సోమవారం రాజాంలోని దేవస్థానం ప్రాంగణంలో పోలీస్, రెవెన్యూ, మునిసిపల్, ఫైర్ తదితర శాఖల అధికారులు, ఎస్వీఆర్ కళాపరిషత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ పరంగా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని చర్యలు తీసుకునేలా పోలీస్ యంత్రాంగం పనిచేస్తుందని ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. పారిశుధ్య నిర్వహణకు వీలుగా సిబ్బందిని నియమిస్తామని, పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు వీలుగా సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని మునిసిపల్ శానిటరీ ఇనస్పెక్టర్ హరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్వీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అగ్నిమాపకశాఖ అధికారి జనార్దనరావు, ఆలయ ధర్మకర్త దుర్గాప్రసాద్, ఎస్వీఆర్ కళాపరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, పొగిరి సురేష్ బాబు, మక్క అప్పలనాయుడు, అర్నిపల్లి వెంకటనాయుడు, వాకచర్ల రాజా, పైడిరాజు, గ్రంధి గోపి, చైతన్య పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

రామభద్రపురం: మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఎస్ఐ జ్ఞానప్రసాద్ ముమ్మరంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇందులో భాగంగా హెల్మెట్ ధరించాలన్నారు. ఆటోల ముందు భాగంలో ప్రయాణికులను కూర్చోనివ్వవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం లైసెన్సు, హెల్మెట్‌లేని వాహనదారులకు జరిమానా విధించారు.

పది పరీక్షలు ఎంతో కీలకం



పరీక్ష సామగ్రి అందిస్తున్న గొంప కృష్ణ

జామి, మార్చి 11: ప్రతి విద్యార్థికీ పదిపరీక్షలు ఎంతో కీలకమని, తమ ఉన్నత చదువులకు ఇది తొలిమెట్టు అని టీడీపీ రాష్ట్రకార్యదర్శి గొంప కృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని అలమండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు మండల టీడీపీ అధ్యక్షుడు లగుడు రవికుమార్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి అందించారు.

రైల్వేట్రాక్ పునరుద్ధరణ



ట్రాక్ పునరుద్ధరణ పనులు చేస్తున్న దృశ్యం

లక్కవరపుకోట (కొత్తవలస): కొత్తవలస రైల్వే జంక్షన్‌కు ఆనుకొని ఉన్న విశాఖ-రాయగడ రైల్వేలైను ట్రాకు పునరుద్ధరణ పనులు సోమవారం శరవేగంగా చేపట్టారు. విశాఖపట్టణం నుంచి వందల సంఖ్యలో రైల్వే కార్మికులు, ఇంజనీరింగ్ అధికారులు హాజరై ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆదివారం రాత్రి విశాఖ-భవానిపట్నం పాసింజర్ పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. కొత్తవలస స్టేషన్ నుంచి బయలుదేరిన నిమిషాల్లో ప్రమాదం జరగడంతో ప్రాణ, ఆస్తి నష్టాలు ఏమీ జరగలేదు. కొత్తవలస-అలమండ మధ్యలో గల లైన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాలాజీ దేవస్థానం ఉద్యోగి ఆత్మహత్య

రాజాం రూరల్: బాలాజీ దేవస్థానం ఉద్యోగిగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన బ్రజ్ బిహారీ త్రిపాఠి (39) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 'నేనో చెడుమార్గంలోకి వెళ్లాను. అందులోనుంచి తిరిగి బయటకు రాలేని పరిస్థితి. అందుకే నేనీ తప్పుడు నిర్ణయం తీసుకోవలసి వచ్చింది. భవిష్యత్తులో ఇలాంటి పరిణామాలు ఎదుర్కొంటానని నేను చెడుమార్గంలోకి దిగకముందు తెలుసుకోలేకపోయాను. అందుకే చావు తప్ప వేరొక మార్గం నాకు దొరకలేదు. నా కుటుంబానికి నేను అన్యాయం చేశాను. నేను చనిపోయాక నా బాడీని నా కుటుంబానికి చేరవేయండి' అని ఈనెల 10న తన డైరీలో మరాఠీలో సూసైడ్‌నోట్ రాసుకుని సోమవారం ఉదయం తాను నివశిస్తున్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజాం ఎస్ఐ రవికిరణ్ కథనం మేరకు.. మండలంలోని అంతకాపల్లి సమీపంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో బాలాజీ దేవస్థానంలో వంటమనిషిగా పనిచేస్తున్న బ్రజ్ బిహారీ త్రిపాఠి (39) సోమవారం గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన త్రిపాఠి బాలాజీ దేవాలయంలో 2018 నుంచి స్వామివారికి ప్రసాదం, భోగం తయారీచేసే వృత్తిలో కొనసాగుతున్నాడు. సోమవారం ఉదయం 9.30 గంటలకు క్వార్టర్స్‌కు వెళ్లిన త్రిపాఠీ 11 గంటలకు స్వామివారికి భోగం నివేదించేందుకు తీసుకురావాల్సి ఉంది. సమయం గడుస్తున్నా ప్రసాదం తీసుకు రాకపోవ డంతో ఆలయ ప్రధాన అర్చకుడు బూరుగడ్డ కాందాలి వెంకట రామానుజాచార్యులు త్రిపాఠి గది వద్దకు వెళ్లి చూడగా గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని వేలాడి ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఆలయ అధికారులతో పాటు రాజాం పోలీసులకు సమాచారం అందజేశారు. మృతుడు త్రిపాఠికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. రామానుజాచార్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం ఎస్ఐ రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న లారీ

● అయిదుగురికి తీవ్ర గాయాలు

లక్కవరపుకోట(కొత్తవలస): మండల కేంద్రమైన కొత్తవలసలో విజయనగరం- కొత్తవలస రోడ్డు మార్గంలో పీఎంఎల్ కాంప్లెక్స్ వద్ద ఆగి ఉన్న కారును లారీ ఢీకొన్న సంఘటనలో అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అందులో ఒక మహిళ పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ స్థానిక పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సీతంపేటకు చెందిన ఇద్దరు, కాంప్లెక్స్ వద్ద ఒకరు, దేశపాత్రునిపాలెంకు చెందిన మరొకరు అనారోగ్య రీత్యా ఆసుపత్రికి వెళ్లేందుకు కారులో సిద్ధమయ్యారు. వీరంతా కారులో పీఎంఎల్ కాంప్లెక్స్ వద్దకు చేరుకున్నారు. ఇంతలో విజయనగరం వైపు నుంచి వస్తున్న లారీ ఆగి ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అయిదుగురు గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో మోపాడ లక్ష్మి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. గాయపడిన వారిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజాంలో ఏసీ మరమ్మతుల షాపు దగ్ధం

రాజాం రూరల్: రాజాంలోని ఎన్టీఆర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సోమవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో ఏసీ మరమ్మతుల షాపు దగ్ధమైంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు.. యజమాని గణేష్ సోమవారం ఉదయం షాపు తెరిచి విద్యుత్ మీటర్ ఆన్‌చేసి షాపు షట్టర్ సగం దించి టిఫిన్ కోసం బయటకు వెళ్లాడు. ఇంతలో ఉన్నపలంగా మంటలు చెలరేగాయి. ఏసీలు, ఫ్రిజ్‌ల్లో గ్యాస్, ప్లాస్టిక్‌తో కూడుకుని ఉన్న పరికరాలు ఉండడంతో క్షణాల్లో బూడిదయ్యాయి. షట్టర్ సగం దించి ఉండడంతో అగ్నిప్రమాదం సంభవించిందన్న విషయాన్ని సమీప షాపుల యజమానులు గుర్తించలేకపోయారు. బయట నుంచి వచ్చిన షాపు యజమాని షట్టర్ తెరిచే ప్రయత్నం చేసేసరికే దాదాపుగా పరికరాలన్నీ మాడిపోయాయి. దీంతో పలువురు ఖాతాదారులకు చెందిన పలు ఏసీలు, ఫ్రిజ్‌లు, కూలర్లు, ఫ్యాన్లు ఇతరత్రా ఎలక్ట్రికల్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు రాజాం పోలీసులకు గణేష్ ఫిర్యాదు చేశాడు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

బొబ్బిలి(బాడంగి): అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్టు ఎస్ఐ ఆర్.జయంతి తెలిపారు. బాడంగి మద్యం దుకాణం నుంచి వంద మద్యం సీసాలను తరలిస్తున్న నందబలగ గ్రామానికి చెందిన గోపీని పాల్తేరు గ్రామ సమీపంలో పట్టుకున్నామని తెలిపారు. అతని నుంచి మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు ఆమె తెలిపారు. ఈ దాడిలో ఏఎస్ఐ కొండలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని జాడపేట గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నుంచి ఉంగరాడ మెట్ట సెంటర్‌లో సోమవారం పోలీసులు 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. నిందితుడు బెల్ట్‌షాపు నిర్వహణకు తీసుకువెళ్తున్న మద్యాన్ని పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గంట్యాడ, మార్చి 11: మండలంలోని నరవ గ్రామానికి చెందిన పతివాడ నారాయణరావు(48) ఆదివారం రాత్రి నీలావతి కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనికి సంబంధించి ఎస్ఐ సురేంద్రనాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు నారాయణరావు, నీలావతి గ్రామంలోని జరిగిన గ్రామ దేవత జాతరకు వెళ్లి దిచక్రవాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న బొండపల్లి మండలం కొత్తూరు చెందిన ద్విచక్ర వాహనాన్ని వేగంగా నీలావతి కూడలి వద్ద ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వెంటనే జిల్లా కేంద్ర ఆసుపత్రికి చికిత్స కోసం తరలించగా, నారాయణరావు తలకు బలమైన గాయం తగలడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు వినతి

విజయనగరం: ప్రభుత్వం ప్రకటించిన జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. సోమవారం జేసీ కార్తిక్, డీఆర్వో అనితకు వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రెండో విడతలో కూడా జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్నారని మండల, జిల్లా స్థాయిలో జాబితా సిద్ధం చేసి స్థలాలు గుర్తించాలని కోరారు. త్వరలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్న కారణంగా ప్రత్యేక చొరవ చూపాలన్నారు.

ఎస్పీ స్పందనలో ఎనిమిది ఫిర్యాదులు



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

బెలగాం: స్పందన కార్యక్రమంలో ఎనిమిది ఫిర్యాదులు అందినట్టు ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. పార్వతీపురంలోని ఎస్పీకార్యాలయంలో సోమవారం ఆయన ఆధ్వర్యంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ నేరుగా అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలతో ఫిర్యాదు చేయడానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను స్వయంగా విని సంబంధిత అధికారులకు త్వరతగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల నుంచి ఫిర్యాదులను సమ గ్ర విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని అన్నారు. నిందితులకు చట్ట ప్రకారం శిక్ష విధిస్తామని, బాధితులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ దిలీప్‌కిరణ్, ఎస్పీ సీఐ సీహెచ్.లక్ష్మణరావు, డీసీఆర్బీ సీఐ ప్రసాద్‌రావు తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ స్పందనకు 29 వినతులు

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్య క్రమానికి 29 వినతులు వచ్చినట్టు పీవో కల్పనాకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రోసిరెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, పీఏవో హరికృష్ణ, పీహెచ్‌వో గణేష్, సీడీపీవో రంగలక్ష్మి, జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'కు వంద అర్జీలు



స్పందనలో వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వంద అర్జీలు అందాయి. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జాయింట్ కలెక్టర్ శోభిత, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, ఎల్విన్‌పేట ఎస్‌డీసీ ఆర్.వి.సూర్యనారాయణతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డీపీఓ బలివాడ సత్యనారాయణ, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ అధికారి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకే సీట్లు కేటాయించాలి

- **ఆదివాసీ జేఏసీ ట్రైబల్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు ధర్మారావు**

సీతంపేట: రానున్న సార్వత్రికఎన్నికల్లో ఏడుఎస్టీ రిజర్వ్ అసెంబ్లీ సీట్లతో పాటు పార్లమెంట్ సీటు నిజమైన గిరిజన అభ్యర్థులకు ఆయా పార్టీలు కేటాయించాలని ఆదివాసీ జాయింట్ యాక్షన్ కమిటీ ట్రైబల్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు కె.ధర్మారావు కోరారు. సోమవారం సీతంపేటలో ఏజేఏసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీగిరిజన అభ్యర్థులను ఓడించడానికి తాము ప్రయత్నిస్తామన్నారు. భారత ఆదివాసీ పార్టీ తరఫున అన్ని అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టి ఆదివాసీ జేఏసీ మద్దతు ప్రచారం చేసి గెలిపించుకుంటామని చెప్పారు. అనంతరం ఏజేఏసీ నాయకులు నిరసన తెలిపారు. కార్యక్రమంలో కె.నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, హిమరిక ప్రసాద్ పాల్గొన్నారు.

● **బెలగాం:** ఎస్టీ రిజర్వేషన్ అయిన అరకు ఎంపీ టికెట్ నిజమైన గిరిజన అభ్యర్థికే ఇవ్వాలని ఆదివాసీ జేఏసీ నాయకులు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి, పీవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎస్టీ రిజర్వేషన్ ప్రాంతాల్లో గిరిజనేతురులకు ఆయా పార్టీలు టికెట్ ఇస్తున్నాయని అన్నారు. నిజమైన గిరిజనులకు టికెట్ ఇస్తే ఓడిస్తామని హెచ్చరించారు.



బెలగాం: నిరసన తెలుపుతున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

ఒడిశా

31 కిలోల గంజాయి స్వాధీనం

రాయగడ: అంబోదల రైల్వేస్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు నిందితులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 31.220 కిలోల గంజాయిని, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేసి కోర్టుకు తరలించారు.

కాంగ్రెస్‌తోనే యువతకు భవిత



మాట్లాడుతున్న మోహన్ నాయక్

రాయగడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల భవితను అంధకారంలోకి నెట్టాయని... కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే యువతకు ఉపాధి లభిస్తుం దనిజిల్లా యువకాంగ్రెస్ అధ్య క్షుడు మోహన్ నాయక్ అన్నారు. స్థానిక కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ..రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేస్తామని, ఉపాధి హామీ పథకం పక్కాగా అమలు చేసి యువతను భాగస్వాములను చేస్తామని చెప్పారు. డి ప్లొమా, లేదా డిగ్రీ పాసైన 25 ఏళ్లలోపు నిరుద్యోగ యువతకు ఏడాదికి రూ.లక్ష నిరుద్యోగ భృతి అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు భరత్‌మాఝి, సయ్యద్ జెనుల, భవానీశంకర్ జెనా, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ సేవలు స్ఫూర్తిదాయకం



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ముదిలి

రాయగడ: రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ దళితుల ఉన్నతి కోసం చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని స్థానిక శాసన సభ్యులు మకరం ద ముదిలి అన్నారు. కాశీపూర్ సమితి కేంద్రం బిలమాల్ వీధిలో గిరిజన సంఘ సభ్యులు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్ర మంలో జిల్లా పరిషత్తుఅధ్యక్షురాలు సరస్వతి మాఝి, సమాజసేవిక సదన్ మాఝి, సమితి అధ్యక్షులు నోక్ మాఝి పాల్గొన్నారు.

శతావధానం ప్రారంభం

రాయగడ: ఉత్కళ బ్రాహ్మణ సమాజం ఆధ్వర్యం లో సోమవారం శతావధాన కార్య క్రమం ప్రారంభ మైంది. స్థానిక వేంకటేశ్వరాలయ కల్యాణ మండపంలో భీమడోలుకు చెందిన బులుసు అపర్ణ, ఉర్లాం సంస్థానానికి చెందిన బంకుపల్లి రమేష్‌శర్మలు శతావధానకార్యక్రమాన్ని ప్రారంభించారు. మొత్తం 108 మంది పృచ్ఛకులు పాల్గొంటున్నారు.కార్యక్రమం బుధవారం వరకు సాగుతుందని నిర్వాహకులు శ్రీనివాసశర్మ, భళ్లమూడి నాగరాజులు తెలిపారు.



శతావధానంలో వేదికపై అపర్ణతో పృచ్ఛకులు



గుమ్మలక్ష్మీపురం: జగదీశ్వరి ఆధ్వర్యంలో పార్టీలో చేరుతున్న నాయకులు



పార్వతీపురం: టీడీపీలో చేరిన వారితో అభ్యర్థి విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ జగదీష్

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

- తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

విజయమే లక్ష్యంగాపార్టీ శ్రేణులు పనిచేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లాలో పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వారికి నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కండువాలు వేసి ఆహ్వానించారు.

విజయచంద్ర సుడిగాలి పర్యటన

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: పార్వతీపురంలో టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. వివిధ వార్డుల్లో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడగానే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను విజయచంద్ర వివరించారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ విజయచంద్ర విజయంకోసం అంకితభావంతో పనిచేయాలని కోరారు.మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి పాల్గొన్నారు. పట్టణంలోని 25వ వార్డుకు చెందిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలో చేరారు. అభ్యర్థి విజయచంద్ర, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ ఆధ్వర్యంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, మజ్జి కృష్ణమోహన్, జి.వెంకటనాయుడు, రవికుమార్, మజ్జి వెంకటేష్, పాలకొండ రాజశేఖర్, హనుమంతు శంకర్, డాక్టర్ భానుప్రసాద్, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో 125 కుటుంబాలు చేరిక

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొయ్యిపాక పంచాయతీలోని రసాబడి, గుల్ల లంక, కిత్తలంబ, కుంతెసి, గొయ్యిపాకల గ్రామాలకు చెందిన 125 కుటుంబా లు టీడీపీలో చేరాయి. వీరికి కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శనరావు, పోలూరు శ్రీనివాసరావు, వెంకటాపు భారతి, సుందరరావు, రమేష్, కిల్లకదాసు, రామారావు పాల్గొన్నారు.

బీసీలకు అండగా నిలిచేది టీడీపీయే

గరుగుబిల్లి: వెనుకబడిన బీసీ వర్గాలకు అండగా నిలిచేది టీడీపీయేనని ఆ పార్టీ అరకు బీసీ సెల్ అధ్యక్షుడు బూరాడ రామ్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. బీసీ డిక్లరేషన్‌లో పది పథకాలను ప్రవేశపెట్టిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధి అవకాశాలు దొరక్క ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి జగన్‌రెడ్డి కల్పించారన్నారు. బీసీ వర్గాలకు రెండు ప్రధాన పార్టీలు అండగా నిలవడం అభినందనీయమన్నారు. అరకు పార్లమెంటు పరిధిలో ప్రత్యేక అవగాహనతో పాటు పార్టీ అభ్యర్థులు గెలుపునకు అవసరమైన ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, అధికారులు

గరుగుబిల్లి: గ్రామాల్లోని యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఉల్లిభద్ర డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్న కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని సంతోషపురంలో మాదక ద్రవ్యాల నిషేధంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో ఒకవైపు ఆరోగ్యం క్షీణించడంతో పాటు మరోవైపు సమాజంలో తగిన గుర్తింపు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు డాక్టర్ బి.హరిరామ్ కుమార్, జి.నరసింహమూర్తి, సీహెచ్ కిరణ్‌కుమార్, ఆర్.పూర్ణ చైతన్య హెచ్.అరుణకుమారి, సర్పంచ్‌లు ఎ.తవిటినాయుడు, కె.రవీంద్ర, కార్యదర్శులు చరణ్, పి.రాజేష్‌కుమార్, వీఆర్‌వో పి.రామకృష్ణ, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధం

- **పార్వతీపురం, సాలూరులో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన**



పార్వతీపురంటౌన్: ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్: ఎన్నికల బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని, ఇప్పటివరకు స్వీకరించిన బాండ్ల వివరాలను వెంటనే సుప్రీంకోర్టుకు అందించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పట్టణంలోని స్టేట్‌బ్యాంకు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం మన్యం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు మాట్లాడుతూ ఎస్‌బీఐ గత నాలుగేళ్లుగా అమ్మిన బాండ్లు, వాటిని కొన్నవారి సమస్త సమాచారాన్ని ఎన్నికల సంఘానికి మార్చి6వ తేదీలోగా, 13వ తేదీలోగా బహిర్గతపరచాలని సుప్రీంకోర్టు.. ఈసీకి ఆదేశించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీవీ రమణ, పి.సన్యాసిరావు, బి.దాసు, సూరిబాబు, రాజశేఖర్, ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

● **సాలూరు:** సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఎన్నికల బాండ్ల వివరాలను తక్షణం తెలియజేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎన్‌వై.నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో స్థానిక ఎస్‌బీఐ కార్యాలయం ముందు సీపీఎం ఆధ్వ ర్యంలో సోమవారం నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

పాలకొండ: బాపట్లలో జరిగిన సిద్ధం బహిరంగ సభలో ఒంగోలుకు చెందిన పారిశుధ్య కార్మికుడు మురళీకృష్ణ మృతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నైతిక బాధ్యత వహించాలని నగర పంచాయతీ మునిసిపల్ కార్మికుల కమిటీ కార్యదర్శి సీహెచ్ సంజీవి, కోశాధికారి పి.వేణు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి నగర పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన మురళీకృష్ణ కుటుంబానికి ఆదుకోవాలని, మురళీకృష్ణ భార్యకు ప్రభుత్వ ఉద్యోగంతో పాటు పక్కా ఇల్లు ఇవ్వాలని కోరారు. కార్య క్రమంలో పారిశుధ్య కార్మికులు పి.మధు, చింతల రఘు, వండాన ఆంజనేయులు, బి.విశ్వేశ్వరరావు, నాగవంశం సాయి పాల్గొన్నారు.

రూ.వెయ్యి విడుదల చేయండి

- **సాలూరులో బైఠాయించిన పారిశుధ్య కార్మికులు**

సాలూరు: మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు జనవరి, ఫిబ్రవరి నెలల జీతాలతో పాటు జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వెయ్యి రూపాయలను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. సర్వసభ్య సమావేశానికి మున్సిపల్ కౌన్సిలర్లను, అధికారులను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. పారిశుధ్య కార్మికుల నాయకుడు ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ జిల్లాలో పాలకొండ, పార్వతీపురంలలో పారిశుధ్య కార్మికులకు జీతాలు పడినా సాలూరులో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు ఎందుకు ఇంకా జీతాలు ఇవ్వటం లేదని ప్రశ్నించారు. అధికారులకు జీతాలు ఇవ్వకపోతే ఇలానే ఊరుకుంటారా.. అని ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ వచ్చి విషయం తెలుసుకున్నారు. అధికారులతో మాట్లాడారు. మరో నాలుగు రోజుల్లో జీతాలు పడేలా చూస్తానని చెప్పటంతో కార్మికులు తమ నిరసనను విరమించారు. అనంతరం తమ వినతిపత్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఈశ్వరమ్మకు మున్సిపల్ మేనేజర్ రాఘవాచార్యులకు అందజేశారు.



మునిసిపల్ కార్యాలయంలోకి ప్రజాప్రతినిధులు రాకుండా అడ్డుకుని నిరసన తెలుపుతున్న కార్మికులు

నేడు పోలమాంబ 8వ వారం జాతర

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శ్రీశంబర పోలమాంబ 8వ వారం జాతర మంగళవారం జరగనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా దేవదాయ శాఖ ఏఈవో సూర్యనారాయణ ఏర్పాట్లుచేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.నరసింహమూర్తి ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, డిపోల నుంచి బస్సులు నడపనున్నారు.

రేపు గుమ్మలక్ష్మీపురంలో జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వడిగ్రీ కళాశాలలో బుధవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్‌స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఒక ప్రకటనలో తెలిపారు డెక్కన్ ఫైన్ కెమికల్స్, హెటరొట్, అపోలో ఫార్మసీ, బ్యాంకులు తమ కంపెనీలో ఉద్యోగం చేయడానికి అర్హులైన అభ్యర్థులను ఎంపికచేస్తాయని పేర్కొన్నారు. కెమిస్ట్రీ విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా ఏదైనా డిగ్రీ, ఇంటర్‌లో పాసైన అభ్యర్థులు హాజరుకావాలని కోరారు.

సమయపాలన పాటించండి

వీరఘట్టం: ప్రతిఒక్కరూ విధుల్లో సమయపాలన పాటించాలని ఎంపీడీవో ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు. సోమవారం వీరఘట్టంలో పంచా యతీ సెక్రటరీ సమావేశం నిర్వహించారు.ఈ నందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో విధులను సక్రమంగా నిర్వహిం చాలని తెలిపారు.

గర్భిణులపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి: గర్భిణుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తెర్లి జగన్మోహనరావు సూచించారు. సోమవారం బీవీపురం, ఉల్లిభద్ర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.పార్వతి, మాలతి, అనిత పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయం

పాలకొండ: మహిళల ఆర్థికాభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ విక్రాంత్, ఎమ్మెల్యే కళావతి పేర్కొన్నారు. సోమవారం నగరపంచాయతీ కార్యాలయ ఆవరణలో చేయూత కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు డెమో చెక్కులను పంపిణీచేశారు. కార్య క్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ యందవ రాధాకుమారి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ఏర్పాట్లు చేయండి

వీరఘట్టం: పదో తరగతి పరీక్షలక సంబంధించి విద్యార్థులకు ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలకు తహసీల్దార్ కె.జయప్రకాష్ కోరారు. పదోతరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి 27 వరకు జరగనున్న నేపథ్యంలో ఏర్పాట్లకు సంబంధించి వీరఘట్టంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను సోమవారం తహసీల్దార్ సందర్శించారు. కార్య క్రమంలో ఆర్ఐ లక్ష్మణనాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేట సమీపంలో లారీ బోల్తా

గుమ్మలక్ష్మీపురం: రాజమండ్రి నుంచి రాయపూర్ మీదుగా అల్యూమినియం లోడ్‌తో ఢిల్లీ వెళ్తున్న లారీ ఎల్విన్‌పేట సమీపంలో సోమవారం రాత్రి బోల్తాపడింది. ఈ ఘటనలో లారీడ్రైవర్ తలకు స్వల్పగాయంకావడంతో 108 లో పార్వతీపురం ఏరియా ఆసుప త్రికి తరలించారు. రాత్రి వేళ ప్రధాన రహదారిపై లారీ బోల్తాపడడంతో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

వేరుశనగ సాగులో మెలకువలు పాటించండి

సీతానగరం: జాతీయ నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా చినంకలాం గ్రామంలో సోమవారం వేరుశనగ పంటలో అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన మెలకువలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ మాట్లాడుతూ వేరుశనగ పంటలో తగిన సస్యరక్షణ చర్యలు పాటి స్తే అధిక లాభాలు పొందవచ్చునని తెలిపారు. వివిధ తెగుళ్లకు తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు.

ప్రకృతి వ్యవసాయంలో రైతులు విజయం

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: ప్రకృతి వ్యవసాయంలో రైతులు విజయం సాధిస్తున్నారని వ్యవసాయశాఖ జిల్లా అధికారి రాబర్ట్‌పాల్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో వ్యవసాయ శాఖ, రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకం శిబిరాన్ని ప్రారంభించారు. రాబర్ట్‌పాల్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో కొంతమంది రైతులు లాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీసీఈఎన్‌ఎఫ్ జిల్లా అధికారి పి.షన్ముఖరావు, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు

మక్కువ: నీటిఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్టు జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు తెలిపారు. మక్కువలో క్రాష్ ప్రోగాం వాహనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే సంబంధిత సిబ్బందికి తెలియజేసి బోర్లను బాగు చేసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి.దేవకుమార్, మండల వైసీపీ అధ్యక్షుడు మావుడి రంగునాయుడు, ఏఈ జోగారావు పాల్గొన్నారు.

● **జియ్యమ్మవలస:** ఈ వేసవిలో మండలంలోని ఏ గ్రామంలోనూ నీటి ఎద్దడి ఉండరాదనే ఉద్దేశంతో క్రాష్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.శ్రీనివాసరావు తెలిపారు. జడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ జెండా ఊపి సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రాష్ ప్రోగ్రాం షెడ్యూల్‌ను ఎంపీడీవో విడుదల చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భరత్‌చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. తప్పిన ప్రమాదం

గరుగుబిల్లి: మండలంలోని సీతారాంపురం ప్రధాన రహదారిపై సోమవారం ఎదురెదురుగా వస్తున్న రెండు కార్లు ఢీకొన్నాయి. పార్వతీపురం నుంచి ఉల్లిభద్ర వైపు వెళ్తున్న కారు, ఉల్లిభద్ర నుంచి పార్వతీపురం వైపు వెళ్తున్న మరో కారు సీతారాంపురం మలుపులో ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు కార్లు ముందు భాగాలు అధికంగా నుజ్జునుజ్జయ్యాయి. అయితే రెండు కార్లలో ఉన్నవారికి చిన్నపాటి గాయాలయ్యాయి. వీరిని పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు.

ఐటీడీఏలో మహిళా దినోత్సవం

సీతంపేట: ఐటీడీఏ ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో కల్పనాకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు.అనంతరం వివిధరంగాల్లో రాణిస్తున్న మహిళలకు పీవో బహుమతులు అందించారు. అనంతరం కేక్‌కట్ చేశారు. కార్య క్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, ఎంపీడీవో గీతాంజలి, డిప్యూటీ డీఈవో లిల్లీరాణి, వ్యవసాయశాఖ ఏడీ రత్నకుమారి, సీడీపీవో రంగలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ నీలిమ, ఏవో శ్రీదేవి, రాములమ్మ, ఏపీవో రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, డీడీ అన్నాదొర పాల్గొన్నారు.

నిబంధనల మేరకు చెల్లించండి



ఆన్‌లైన్‌లో పంచాయతీల వివరాలను పొందుపరుస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ప్రభుత్వ నిబంధనల మేరకు చెల్లింపులు ఉండాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావులు సూచించారు. సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో డిజిటల్ కీఆన్‌లైన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ ఎస్‌ఐసీ నిబంధనల మేరకు డిజిటల్ చెల్లింపులు నిర్వహించాల్సి ఉందన్నారు. నిధులు దుర్వినియోగం కాకుండా ఉండేందుకే కేంద్ర ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రారంభించిందని తెలిపారు. కార్యదర్శులు అలసత్వం వహించకుండా డిజిటల్ కీలో వివరాలు పొందుపర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బి.వెంకటనాయుడు, కార్యదర్శులు టి.భాస్కరరావు, అప్పారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వం మాటను అమలు చేయండి

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వర్కింగ్ జర్నలిస్టులు అందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు అందిస్తామని చెప్పినప్పటికీ జిల్లాలో ఆ హామీ నేటి వరకు అమలు కాలేదని, వెంటనే అమలు చేయాలని ఏపీయూడబ్ల్యూజే, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు జేసీ ఎస్.ఎస్.శోభికకు వినతిపత్రాన్ని అందించారు. సోమవారం 'స్పందన' కార్యక్రమంలో జర్నలిస్టుసంఘాల నాయకులు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు జాయింట్ కలెక్టర్‌ను కలిసి ఇళ్ల స్థలాల భూమిని ప్రభుత్వం సిద్ధం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రక్షణ కల్పించాలని...

బెలగాం: ఎన్నికల నేపథ్యంలో జర్నలిస్టులకు పూర్తి స్థాయిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో రక్షణ కల్పించాలని ఏపీయూడబ్ల్యూజేఎఫ్, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఎస్పీ విక్రాంత్‌పాటిల్‌కు వినతిపత్రం అందించారు. జర్నలిస్టులపై దాడులు చేసినవారిని శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

కోడ్‌కు ముందే చేయూత డబ్బులు చెల్లించాలి

గుమ్మలక్ష్మీపురం: చేయూతపథకం నాలుగోవిడత సంబంధించి విడుదలచేసిన డబ్బులు ఖాతాదారులకు ఎన్నికల కోడ్‌కు ముందే చెల్లిం చాలని ట్రైబల్ రైట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు రొబ్బా లోవరాజు డిమాండ్ చేశారు. గుమ్మలక్ష్మీపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లబ్ధిదారుల ఖాతాల్లోకి ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ విడతల వారీగా లబ్ధిదారులకు ఖాతాలో వేస్తాం దని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కొంతమంది నష్టపోయే ప్రమా దముందని చెప్పారు.